
ప్రజాశక్తి
సోమవారం 27 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎస్.కోట బాలుడికి స్థానం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రంతో సంజీవ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పట్టణానికి చెందిన తేతల భాను ప్రకాశ్‌రెడ్డి, సాయి శివానీల కుమారుడు తేతల సంజీవ్ రెడ్డి(4)కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 30 సెకన్లలో దేశంలోని 28 రాష్ట్రాల పేర్లను రాజధానులతో సహా చెప్పడం ద్వారా సంజీవ్ అర్హత సాధించాడు. ఈ మేరకు సంజీవ్‌ను అభినందిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం, బంగారు పతకం, పుస్తకం, కలం బహుమతిగా అందజేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన సంజీవ్‌ని స్థానికులు, నాయకులు అభినందించారు.

అధికార పార్టీలో.. వ్యతిరేక కుంపటి

- ప్రభుత్వ తీరుపై రగిలిపోతున్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో చుక్కలు చూపించేందుకు యత్నం
- పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూల పవనాలు

అధికార పార్టీలో మొదలైన వ్యతిరేక కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. ప్రభుత్వ తీరుపై అధికార పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు రగిలిపోతున్నారు. వచ్చే నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చుక్కలు చూపించేందుకు కారాలు మిరియాలు నూరుతున్నారు. తమ వరకూ వస్తే తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు టిడిపి మద్దతుతో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి, ఆ పార్టీ గురించి చెప్పుకునేందుకు కూడా సాహసించడం లేదు. ఇవన్నీ పిడిఎఫ్ అభ్యర్థికి అదనపు బలంగా మారుతున్నాయి.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాస్త సమయం అటు ఇటు అయినా సర్పంచులు, ఎంపిటిసి ఎన్నికలు జరిగి సుమారు రెండేళ్లు కావస్తోంది. ఎప్పటి మాదిరిగానే అధికార పార్టీ మద్దతుదారులే ఎక్కువగా గెలిచారు. వీరంతా తమ హయాంలో గ్రామాలను, ప్రాదేశిక నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని ప్రజలకు మాటిచ్చారు. ఎంతో కొంత అభివృద్ధి చేయాలని కలలు కన్నారు. కానీ, ఆశలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ఏమాత్రమూ సహకరించని పరిస్థితి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నవరత్నాలు గానీ, ఇతర సంక్షేమ పథకాలు గానీ సర్పంచులు, ఎంపిటిసిలకు సంబంధం లేకుండానే అమలవుతున్నాయి. మరోవైపు గ్రామ స్వరాజ్యమే ధ్యేయమంటూ ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో సర్పంచుల పాత్ర ఏమీ లేదు. చాలాచోట్ల అక్కడి సిబ్బంది సర్పంచులు, ఎంపిటిసిల మాట వినే పరిస్థితి కూడా లేదు. రెండేళ్ల క్రితం వరకు పంచాయతీ కార్యాలయానికి వచ్చే పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు కూడా మొహం చాటేశారు. పోనీ, సచివాలయంలో కూర్చుందామంటే సర్పంచ్‌కి చోటే లేకుండా పోయింది. ఇంకోవైపు ప్రభుత్వంపై ఆశ, నమ్మకంతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్ల నిర్మాణ పనులకు బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో, ఇటు రాజకీయంగా, అటు ఆర్థికంగా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సతమతమౌతున్నారు.

కాలిన పుండుపై కారం చల్లినట్టుగా స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు 2022-23 ఆర్థిక సంఘానికి సంబంధించి మండల, జిల్లా పరిషత్తులకు 15 శాతం చొప్పున రూ.40 కోట్లు, గ్రామ పంచాయతీలకు 70 శాతం చొప్పున సుమారు రూ.93 కోట్ల మేర రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. దీంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి. విద్యుత్తు బకాయిల కోసం వేధింపులు ఎదుర్కోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇక గ్రామ స్థాయిలో రోడ్ల నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఫ్రీజింగ్ విధించాయి. ఈ నేపథ్యంలో మెజార్టీ సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు లోలోపల మదన పడుతున్నారు. పవరూ లేక, పైసలూ రాక ప్రజలకు ఏమేరకు మేలు చేయగలమంటూ వారంతా చర్చించుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థిని గెలిపించాలని ఒత్తిడి చేయడంతో వీరంతా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఏం చేశామని పట్టభద్రులను ఓట్లు అడగగలమని మదనపడుతున్నారు.

మరోవైపు ప్రతిపక్ష టిడిపి బలపర్చిన అభ్యర్థి ఆ పార్టీ గురించి ఎక్కడా ప్రస్తావించేందుకు కూడా సాహసించలేని పరిస్థితి దాపురిస్తోంది. పార్టీ గురించి ప్రస్తావిస్తే ఎక్కడ ఓట్లు పోతాయోనన్న భయంతో వ్యక్తిగతంగా ఓట్లు అభ్యర్థించుకోవాల్సిన పరిస్థితి. ఆయన వ్యక్తిగతంగా చెప్పుకోవడానికి కూడా ఏమీ లేదు. ఇవన్నీ పిడిఎఫ్ బలపర్చిన కోరెడ్ల రమాప్రభకు అనుకూల పవనాలు కనిపిస్తున్నాయి. విద్యావంతురాలు, మేధావి, అంతకు మించి సుమారు 250 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన అభ్యర్థి కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సైతం ఆమె వైపే చూస్తున్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, హాజరైన పలు కార్మిక సంఘాల నేతలు

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే.. కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను శాసన మండలి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం విశాఖలోని జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ముఖాముఖి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ నేడు కృషి చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలిపారు. ఆరేళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పక్షానికి వంత పాడుతూ కాలం గడిపారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై మండలిలో గళమెత్తి నిజాయితీగా పనిచేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులంతా అందుకు గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై శాసన మండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలంటే రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం, ప్రైవేట్ విద్యా సంస్థల ఉద్యోగుల, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, స్టీల్ ఎఐటియుసి నాయకులు జె.రామకృష్ణ, బిహెచ్ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ సహా ఎస్.ప్రసాద్ (షిప్ యార్డ్), పిఇసిహెచ్‌వి.సాగర్ (బిఎస్ఎన్ఎల్), పడాల రమణ (ఎఐటియుసి), లక్ష్మణరావు (విశాఖ పోర్టు), పిట్టా నారాయణమూర్తి (జింక్ ఎంప్లాయీస్ యూనియన్), బిబి.గణేష్ (ఎల్ఐసి), పలువురు హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్ యూనియన్ల నాయకులు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐ వెంకటరావు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజ్ఞా వికాస్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్షకు విశేష స్పందన లభించింది. నగరంలోని కస్పా హైస్కూల్లో ప్రశ్నపత్రాన్ని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు పోరాటాల్లోనే కాకుంటే, ఇలా విద్యార్థులకు ఉపయోగకరమైన పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటి పరుగుల ప్రపంచంలో ఎవరి పనులు వారు చూసుకుంటున్న తరుణంలో సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులకు కితాబిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులలో భయాన్ని పోగొట్టడం, వారిలో టాలెంట్‌ని వెలికితీయడం కోసం ఏటా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 200 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు దాదాపు పదివేల మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, 3 వేలు, 2 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. పరీక్షను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాస్ మాస్టార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సిహెచ్ రామకృష్ణ, ఎం.సౌమ్య, పట్టణ కార్యదర్శి పి.రమేష్, నాయకులు లావణ్య, సంధ్య, కిరణ్, వెంకటరమణ పాల్గొన్నారు.


నగరంలో ప్రజ్ఞా వికాస్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

జన జాతర

ఓవైపు చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు.. మరోవైపు జామిలో యల్లారమ్మ జాతర.. ఇంకోవైపు రాజాం పోలిపల్లి పైడితల్లమ్మ యాత్ర.. ఇంకేముంది, జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. చీపురుపల్లి, జామి, రాజాంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆయా ఆలయాలకు వేల సంఖ్యలో జనాలు తరలిరావడంతో జన జాతరను తలపించింది. జాతర్ల సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మూడు జాతరలు ఒకేరోజు కావడంతో బస్సులన్నీ కిటకిటలాడాయి.




కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన యాత్రికులు

కనకమహాలక్ష్మమ్మ ఆలయం కిటకిట

గరివిడి : చీపురుపల్లిలోని కనక మహాలక్ష్మి అమ్మవారు 25వ జాతరకు ఆదివారం జనం పోటెత్తారు. వేల సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిటకిటలాడాయి. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్తె మజ్జి సిరిసహస్ర వివాహ ఆహ్వాన పత్రికను అమ్మవారికి సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఇఒ గొలుగుల శ్రీనివాస్ చైర్మన్‌కు సాలువా కప్పి అమ్మవారి ఫొటోను అందజేశారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ దంపతులు పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి ఎంపిపిలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి , చీపురుపల్లి జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, ఇప్పిలి అనంత్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఇప్పిలి గోవింద్, ఆలయ కార్యదర్శి సూర్యకుమార్, మీసాల విశ్వేశ్వరరావు, వలిరెడ్డి లక్ష్మణ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరం


యల్లారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

జామి : జామి యల్లారమ్మ సంబరం అంబరాన్ని అంటింది. ఆదివారం రాత్రి జాతర వైభవంగా ప్రారంభమైంది. భారీ జనసందోహం మధ్య అమ్మవారి ఊరేగింపు సాగింది. రాత్రి 10.30 గంటలకు గద్దె ఇంటి నుంచి బయలుదేరిన పూజారి తెల్లవారు జామున ఆలయ ప్రవేశంతో జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ఇటీవల ప్రాచుర్యం పొందిన పల్సర్ బైకు ఝూన్సీ డ్యాన్స్ బేబీ డ్యాన్స్ చూపరులను కట్టిపడేసింది. సంబరంలో బాణసంచా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలేళ్ల పండుగ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి ఆలయానికి రద్దీ పెరిగింది. యాత్రికులు ముడుపులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన పోలిపల్లి పైడితల్లి యాత్ర

రేగిడి : రాజాం మండలంలోని కొండంపేట గ్రామంలో ఆదివారం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి పండగ ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు తొలి రోజు వేడుకలు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. పండగ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బొబ్బిలి డిఎస్‌పి మోహన్ రావు ఆధ్వర్యంలో సిఐ ఉపేంద్ర రావు, ఎస్ఐల సమక్షంలో భారీ బందోబస్తు నిర్వహించారు.


పైడితల్లమ్మ ఆలయం వద్ద క్యూలో జనాలు

క్షయ నిర్మూలనే లక్ష్యం

- నిక్షయపాత్ర ద్వారా ఫుడ్ బాస్కెట్లు
- అవగాహనతోనే క్షయ, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్షయ నియంత్రణ అధికారి జె.రామేశ్వరిప్రభు ముఖాముఖి





2025 నాటికి జిల్లాలో పూర్తిస్థాయిలో క్షయ వ్యాధిని నియంత్రించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి జె.రామేశ్వరి ప్రభు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిక్షయపాత్ర పథకం ద్వారా స్వచ్ఛంద సంస్థలు, దాతల ద్వారా టిబి సోకిన వారికి ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ప్రధానంగా అవగాహన పెంచుకోవడం ద్వారా లెప్రసీ, ఎయిడ్స్, టిబి వ్యాధుల బారి నుంచి బయటపడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో టిబి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, నివారణ మార్గాల గురించి ఆమె వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

? జిల్లాలో క్షయ వ్యాధి ఏ స్థాయిలో ఉంది, నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?.

జిల్లాలో క్షయ సోకిన వారు 1900 మంది ఉన్నారు. వారికి ప్రభుత్వం నుంచి మందులు అందిస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధి తీవ్రత బట్టి 6 నెలల నుంచి మూడేళ్ల వరకు మందులు వాడాల్సి వస్తుంది, అదే ప్రాతిపదికన మందులు ఇచ్చి, వైద్య సేవలు అందిస్తున్నాం.

? క్షయను గుర్తించేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

క్షయను గుర్తించేందుకు జిల్లాలో అన్ని పిహెచ్‌సిలో పరీక్షలు చేస్తున్నారు. జిల్లా కేంద్రాస్పత్రితోపాటు ఎఆర్‌టి కేంద్రాలు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో నాలుగు లక్షణాలపై పరీక్షలు చేస్తున్నారు. ఎక్స్‌రే కూడా తీస్తున్నారు. క్షయ గాలి ద్వారా సోకే అవకాశం ఉంది. దగ్గు, జ్వరం, ఎముకల నొప్పులు, పిల్లలో బరువు పెరగపోవడం వంటి లక్షణాలతో గుర్తించే అవకాశముంది. ఎక్కువగా ధూళిలో పని చేసే వారు, జ్యూట్ మిల్లు కార్మికులకు, సిగరెట్లు, మద్యం తాగేవారికి, డయాలిసిస్ రోగులకు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న క్షయ సోకే అవకాశముంది. శరీరంపై నొప్పి రాని మచ్చలు ఉన్నా, ముఖంపై మచ్చలు వచ్చినా లెప్రసీగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలి. లెప్రసీ సోకిన తర్వాత రెండేళ్ల నుంచి 30 ఏళ్ల కాలంలో బయట పడే అవకాశముంది.

? క్షయ నివారణ ఎలా?.

క్షయ రెండు రకాలుగా ఉంటుంది. గుర్తించిన వెంటనే 6 నెలలు నుంచి మూడేళ్ల వరకు మందులు వాడితే పూర్తిగా నివారణ అయ్యే అవకాశం ఉంది. రెండోది మొండి క్షయ. ఇది జిల్లాలో సోకిన వారు 85 మంది వరకు ఉన్నారు. ఇది కొంచెం దీర్ఘకాలం ఉంటుంది. మందులు నిరంతరం వాడాల్సి ఉంటుంది.

? క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు?.

క్షయ సోకిన వారికి కేంద్ర ప్రభుత్వం నిక్షయపాత్ర యోజన కింద ప్రతి రోగికి నెలకు రూ.500 చొప్పున ఆర్నెల్లు అందిస్తుంది. కొత్తగా నిక్షయపాత్ర పథకం ద్వారా స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల యజమానులు, ఉద్యోగుల నుంచి స్వచ్ఛందంగా ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేయిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 470 మందికి ఫుడ్ బాస్కెట్లు అందించాం. పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఫుడ్‌బాస్కెట్లు అందిస్తున్నాం.

? క్షయ, ఎయిడ్స్, లెప్రసీపై ప్రజల్లో అవగాహనకు చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?.

జిల్లాలో క్షయ, ఎయిడ్స్, లెప్రసీపై ప్రజలు అప్రమత్తంగా ఉండలనే ఉద్దేశంతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ర్యాలీలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రధానంగా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు సహకారంతో ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉంటే వారికి పరీక్షలు చేయించి, మందులు అందిస్తున్నాం. కుటుంబ సభ్యులకు ఆ వ్యాధి సోకకుండా ఎప్పటికప్పుడు వారికీ పరీక్షలు చేస్తున్నాం. ప్రతి ఇంటినీ రెండేళ్లపాటు పర్యవేక్షిస్తున్నాం. లెప్రసీ శస్త్రచికిత్స చేసుకుంటే ప్రభుత్వం రూ.8 వేలు ఆర్థిక సాయం అందిస్తుంది.

? క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధుల నివారణ లక్ష్యాలేమిటి?.


క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధులు సోకిన వారి సంఖ్య గతం కంటే తక్కువగా ఉంది. జిల్లాలో 2025 నాటికి పూర్తి స్థాయిలో క్షయను నియంత్రించాలనేది లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం వ్యాధి నియంత్రణ శాతాన్ని బట్టి ఆయా జిల్లాలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు అందిస్తుంది. ఈ ఏడాది సిల్వర్ మెడల్ సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఆదివారం ద్వారకా తిరుమలలో నిర్వహించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ట్రస్టు ప్రమాణ స్వీకార సభలో కోలగట్ల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రస్టు బోర్డు అధ్యక్షులు బొండాడ రామ్మోహన్‌రావు (రాంపండు) సమాజ సేవ కోసం పరితపించే వ్యక్తి అని, అలాంటి వారుంటే ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేయొచ్చని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఆర్యవైశ్యులకు సిఎం ఇస్తున్న ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయాలలో మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల మనోభావాలకు ఇబ్బందికరమైన చింతామణి నాటక ప్రదర్శన నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వారి పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు నిర్వాహకులు కోలగట్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవిసత్ర సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, వాసవి ఆలయ నిర్మాణదాత సోము ప్రసాదరావు, సినీ నిర్మాత రామ సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు రంగ ప్రసాద్, వాసవి కన్యకా పరమేశ్వర కాలేజీల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కృత్రిమ అవయవాలు పంపిణీ

కొత్తవలస : గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భువనేశ్వర్ ప్రాంతంలో సుమారు 500 మంది వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. చెవిటి మెషిన్లు, హ్యాండ్ క్రచెస్, వీల్చైర్స్, బ్లైండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో ఒడిస్సా గవర్నర్ గణేషి లాల్ పాల్గొని మాట్లాడారు. తన స్వస్థలం హర్యానాలో కూడా 1000 మంది వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేసి ఇటువంటి మంచి సేవ చేయాలని అని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, డాక్టర్ అమృత రామయ్య, అనిల్, ట్రస్ట్ సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు నిధుల సేకరణ

బొబ్బిలి : పోలియో నిర్మూలనకు నిధులు సేకరణ చేయాలని, దీని కోసం అంతర్జాతీయ రోటరీ సంస్థ చేస్తున్న కృషికి సమాజం చేయూతనివ్వాలని రోటరీ అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో పోలియో నిర్మూలన– నిధుల సేకరణ పై రోటరీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా అంతర్జాతీయ రోటరీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకై మిలిండ బిల్ గేట్స్ ఫౌండేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థల భాగస్వామ్యంతో పనిచేస్తుందన్నారు. పోలియో నిర్మూలనే లక్ష్యంగా రోటరీ సంస్థ పనిచేస్తూ ఇప్పటికి 99 శాతం ప్రపంచాన్ని పోలియో రహిత దేశం చేసిందన్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలలో అక్కడక్కడ పోలియో వైరస్ జాడలు కనిపిస్తున్నాయని అక్కడ కూడా పోలియో నిర్మూలనకు రోటరీ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, కె నాగరాజు, కె రామకృష్ణ, శంకర రావు, డేవిడ్ జె విక్టర్, కిరణ్, సజ్జ అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాలకు ప్రభుత్వ వైఫల్యాలే కారణం

శృంగవరపుకోట : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యాలకు కారణం ప్రభుత్వ వైఫల్యాలేనని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆరోపించారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహంలో విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లో కాస్మొటిక్ డబ్బులు వేస్తామని కాలయాపన చేస్తున్నారన్నారు. మరిడి నాడు నేడు 'ఫేజ్‌2లో వసతి గృహానికి ప్రహరీ గోడ, మరుగుదొడ్లు మంజూరైనప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని చెప్పారు. హాస్టల్లో సిబ్బంది కొరత ఉందని వెంటనే నియమించాలన్నారు.

వేధింపుల వల్లే ధనలక్ష్మి ఆత్మహత్య

రేగిడి : గులివిందల ధనలక్ష్మి భర్త, అత్త, మామల వేధింపుల వల్లే ఆత్మహ త్యకు పాల్పడిందని డిఎస్పి మోహన్ రావు వెల్లడించారు. ఈ మేరకు రాజాం సిఐ కార్యాలయంలో స్థానిక విలేక రుల సమావే శంలో ఆదివారం వివరాలను వెల్లడించారు. రేగిడి మండలం ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల గౌరు నాయుడు 2022 ఆగస్టు నెల జోడుబందం గ్రామానికి చెందిన రౌతు గణపతి రావు కుమార్తె ధనలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వివాహం అయిన దగ్గర నుంచి భర్త గౌరు నాయుడుతో పాటు అత్త లక్ష్మి, మామ సూర్యనారాయణ నిత్యం వేధింపులకు గురి చేశారు. దీంతో ధనలక్ష్మి మానసికంగా ఒత్తిడికి లోనైంది. మూడు నెల గర్భంతో ఉన్న తనను రాజాం వైద్య పరీక్షల కోసం తీసుకు వెళ్లమని భర్తను కోరితే ఆయన తిరస్కరించాడు. తోటి స్నేహితురాలితో ఈనెల 24న ఆమె ఆస్పత్రికి వెళ్లింది. తనకు తెలియకుండా ఎందుకు ఆస్పత్రికి వెళ్లావని గౌరు నాయుడు ఆ రోజు ధనలక్ష్మిని కొట్టాడు. గర్భంతో ఉన్న తతను కొట్టడంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం వేకువ జామున ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి రెండు వైపులా తలుపులు వేసి ఉండడంతో గ్రామస్తులు సహకారంతో పోలీస్ సిబ్బంది తలుపులు తీసి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. డిఎస్పితో పాటు రేగిడి ఎస్ఐ శ్రీనివాసరావు పోలీసు సిబ్బంది ఉన్నారు

ఆకట్టుకున్న సంగీత కచేరి


గీతాలాపన చేస్తున్న గాయకుడు

విజయనగరం కోట : ప్రముఖ దర్శకులు, కళా తపస్వి కె. విశ్వనాథన్ దర్శకత్వంలో వచ్చిన పాటలు, ప్రముఖ సింగర్ వాణి జయరాం పాడిన పాటలను ఆలపించి గాయకులు ఆకట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక గురజాడ కళాక్షేత్రంలో 'దొరకునా ఇటువంటి సేవ' అనే సంగీత విభావరీ కార్యక్రమాన్ని ప్రముఖ సంగీత దర్శకులు ఎం.భీష్మారావు, సాయి, పవన్ సారథ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు పాడిన పాటలు అలనాటి ఆణిముత్యాలు శ్రోతలను మంత్రముగ్ధులు చేశాయి. ఈ పాటలు ప్రేక్షకులను మరో 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లాయంటే అతిశయోక్తి కాదు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వైవివి సత్యనారాయణ, రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు బీసెట్టి బాబ్జి, గురజాడ సాంస్కృతిక సమైక్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, ఉమా శంకర్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపుపై హర్షం

విజయనగరం కోట : ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను ఐదేళ్లు పొడిగించడం, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థులకు వయోపరిమితిని ఐదేళ్లు సడలించడంపై ఒసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ ఏ రాష్ట్రంలోనూ వయోపరిమితిని సడలించలేదని పేర్కొన్నారు. ఎపి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వయోపరిమితిని 34 నుంచి 39 ఏళ్లకు పెంచడంతో ఎంతోమంది లబ్ది పొందే అవకాశం ఉందని తెలిపారు.

ఒఎ జిల్లా అధ్యక్షులుగా అయ్యలు

విజయనగరం టౌన్ : ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా గురాన అయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక జిఎస్ఆర్ హోటల్‌లో ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గురాన అయ్యలు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా పి.విజయలక్ష్మి, కె.సుభాష్ చంద్రబోస్, బెల్లాన లక్ష్మి, కె.కృష్ణంరాజు, కోశాధికారిగా నడిపిల్లి గురునాథ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.ఆదిలింగం, సంయుక్త కార్యదర్శులుగా వి.మల్లేశ్వరరావు, వి.వి.రమణ, జి.శ్రీనివాసరావు, డి.దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు బడేటి వెంకట్రామయ్య, రిటర్నింగ్ అధికారిగా ఎస్.జగన్నాథం నాయుడు వ్యవహరించారు. అనంతరం గురాన అయ్యలు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రీడలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు.

రెవెన్యూహోంలో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : సమాజ హితం కోసం ఇంటర్నేషనల్ ఉయ్ లవ్ యు ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతైనా అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ హోంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో 534వ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ శ్రేణులను, రక్తనిధి కేంద్రాల ప్రతినిధులను సమన్వయపరచి మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి, 1680 యూనిట్ల రక్తాన్ని సేకరించి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు.నిర్వాహకులు ఈశ్వర్ కౌశిక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్, కార్యదర్శి సత్యం, సంస్థ సిఇఒ బి.రామ్‌గోపాల్, జయశంకర్, రమేష్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శన


తయారు చేసిన ప్రాజెక్టుతో విద్యార్థినులు

బొబ్బిలి: విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్ జార్జ్ అన్నారు. శ్వేతాచలపతి పాఠశాలలో ఆదివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో 937 ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటు చేశారు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నుంచి మార్స్ రోవర్, మెకనమ్ రోబోట్, క్వాడ్రాపాడ్ రోబోట్, స్మార్ట్ డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్, హ్యూమనాయిడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైజ్ఞానిక ప్రదర్శనను పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఐదువేల మంది వరకు తిలకించారు.

తారక (అయ్యో) రామా..!

- ముందుకు కదలని ప్రాజెక్టు పనులు
- రైతులకు తప్పని ఎదురు చూపులు

ప్రజాశక్తి- గుర్ల

తారకరామా తీర్థ సాగర ప్రాజెక్ట్ పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన ప్రాజెక్ట్ పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. ఎన్నికల సమయంలో రైతే రాజు రైతే దేశానికి వెన్నెముక అంటూ అధికారంలోకి వస్తున్న రాజకీయా పార్టీ నాయకులు అధికారం వచ్చిన తరువాత రైతులను విస్మరిస్తున్నారు. దీంతో రైతులు ఏళ్లగా సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

తారకరామా ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు విజయనగరానికి తాగునీరు అందిస్తామని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్ట్‌లో ఒకటిగా గుర్తించిన తారకరామా ప్రాజెక్టును త్వరితగతిని పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజయశర్మ 2022 జూలై నెలలో ఈ ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామన్నారు. ఇటీవల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈ ప్రాజెక్టును సందర్శించారు. ఎంత మంది పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా యంత్రాంగంలో చలనం లేకపోవడం బాధాకరం.


మధ్యలో నిలిచిపోయిన తారకరామ ప్రాజెక్టు

18 ఏళ్లు దాటినా..?

మండలంలోని కొత్తపేట, గరికివలస మధ్య చంపావతి నదిపై తారకరామా ప్రాజెక్ట్ బ్యారేజి పనులను 2005లో ప్రారంభించారు. ఇప్పటికి సుమారు 18 ఏళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదంటే ప్రభుత్వాలకు ప్రాజెక్టులపై ఎంత చిత్త శుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. ప్రాజెక్టు ప్రారంభంలో రూ.184 కోట్లతో ఈ ప్రాజక్ట్ పనులు ప్రారంభించారు. ఇదే ప్రాజెక్ట్‌కు 2015లో పనులు పూర్తి చేయడానికి రూ.450 కోట్ల అవసరమని అధికారులు అంచనాలు రూపొందించారు. 2020-2021 ఆర్థిక సంవత్సరంలో రూ.30 కోట్ల కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.160 కోట్ల రూపాయలు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అరకొర నిధులు కేటాయించడం వల్ల పూర్తి స్థాయిలో పనులు కదలడం లేదన్న వాదన వినిపిస్తుంది.

పరిహారంతో పరిహాసం

ఈ ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం పూర్తి స్థాయిలో పరిహారం అందక నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం(కొత్తపేట) గ్రామం వైపు నీటి ప్రవాహం వెళ్లకుండా రక్షణ గోడ నిర్మిచాలన్నారు. పనులు ప్రారంభించి దశాబ్ద కాలం దాటిపోవడం తో బెరేజ్‌కి అమార్చని గేట్లు తుప్పు పట్టిపోయ శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రభుత్వం అలసత్వం వల్ల ప్రజాధనం వృధా అవ్వడంతో పాటు రైతులకు సాగునీరు అండలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల జాడెక్కడ..?

- నెల్లిమర్ల నగర పంచాయతీలో కానరాని అభివృద్ధి
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీలో అభివృద్ధి జాడలేదని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సాక్షాత్తు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతి కౌన్సిల్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అభివృద్ధి పనుల పై ఏకరువు పెడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. సమావేశాలు జరుగుతున్న ప్రతీసారి కంఠ శోష మిగులుతుంది తప్ప అభివృద్ధిపై భరోసా కనిపించడంలేదని అంటున్నారు. నగర పంచాయతిలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనుల కాగితాల్లో ప్రతి పాదనలకే పరిమితం కావడం కౌన్సిలర్లు జీర్ణించుకోలేక పోతు న్నారు. ఆయా వార్డుల్లో తాగు నీరు, విద్యుత్, సిసి కాలువలు, రహదార్ల సమస్యల ఉన్నప్పటికీ నాయకులు, అధికార్లు సైతం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా వార్డుల కౌన్సిలర్లు సమావేశాల్లో అసంతృప్తి వెళ్ళగక్కుతున్నారు. కాగా ఇంత వరకు జరిగిన పనులకు అరకొర బిల్లులు చెల్లించడం జరిగిందని మిగతా పనులు ముందుకు సాగడం లేదని కాంట్రాక్టర్లు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు మండిపడుతున్నారు.



నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం

వార్డుల్లో అభివృద్ధి పనులు జరగకపోవడంతో తిరగలేక పోతున్నామని సమాధానం కూడా చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు నగర పంచాయతీ అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని కౌన్సిలర్లు, నగర పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.


రక్తదాన చేస్తున్న యువత

రక్తదాన శిబిరానికి స్పందన

గజపతినగరం : వేసవిలో పెరుగుతున్న రక్త కొరత కారణంగా సహాయ స్ఫూర్తి యువజన సంఘం, సాధన యువజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. స్థానిక సామాజిక వ్యక్తులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గజపతినగరంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, సాధన యువజన సంఘం, సామాజిక వ్యక్తులు విశ్వనాథ, పివిఆర్ ప్రసాద్ రావు, ఆరిషెట్టీ భాస్కర్, డివిఆర్ మాష్టర్, యోగ గురూ శీర వాసు (లాయర్), కందుల గుప్తా, నానాజీ తదితరులు హర్షవర్ధన్ స్కూల్ వేదికగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను సన్మానించారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 35మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ప్రతినిధి పోలుబోతు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికలు లేవా..?

- మూడేళ్లుగా జరగని వైనం
- పెండింగ్‌లోనే కార్మికుల సమస్యలు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక ఫేకర్ అల్లోయ్స్ లిమిటెడ్‌లో రెండేళ్లకి ఒకసారి గుర్తింపు యూనియన్ ఎన్నికలు చట్టపరంగా జరగాల్సి ఉన్నప్పటికీ జరగడం లేదు. ఫేకర్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు 2019లో జరగాల్సి ఉన్నా నేటికీ మూడున్నర సంవత్సరాలు గడిచినా జరగలేదు. కంపెనీలో పని చేస్తున్న కార్మికుల తరపున మాట్లాడేందుకు ఎటువంటి కార్మిక నాయకత్వం లేకపోవడంతో కార్మికులు జీతభత్యాలు పెరగక, ప్రమోషన్స్, రిక్రూట్మెంట్స్ జరగడం లేదు. దీంతో కార్మికులు తీవ్రమైన పని ఒత్తిడితోను, నిరుత్సాహంతోను, అభద్రతాభావంతోనూ ఉన్నారు. ఫేకర్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరిపించాలని ఫేకర్ లేబర్ యూనియన్ 2022 మార్చి నెల నుంచి లేబర్ అధికారులకు లిఖితపూర్వకంగా అర్జీలు పెట్టుకోవడంతో కలెక్టర్ రిఫరెన్స్‌తో డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, రిటర్నింగ్ ఆఫీసర్ నవంబరు 7, 2022న ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిందని కార్మికులు సంతోషించారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చి కూడా నేటి వరకు పోలింగ్ తేదీ డిక్లేర్ చేయకపోవడం, గుర్తింపు యూనియన్ ఎన్నికలు పూర్తిచేయలేకపోడం దురదృష్టకరం. ఈ ఆలస్యానికి కారణం ఫేకర్ మేనేజ్ మెంటేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గరివిడి పరిశ్రమ

అర్జీలు పెట్టినా..?

గుర్తింపు ఎన్నికలు పెట్టాలని ఫేకర్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు విజయనగరం డిసిఎల్, జిల్లా కలెక్టర్, విశాఖపట్నం జెసిఎల్, విజయవాడ అడిషనల్ లేబర్ కమిషనర్, స్పెషల్ లేబర్ కమిషనర్, చాలాసార్లు కలిసి కార్మికుల సమస్యలు చెప్పి ఎన్నికలు పెట్టాలని అర్జీలు పెట్టుకున్నా నేటి వరకూ స్పందన లేదు. యూనియన్ లేకపోవడం వల్ల కార్మికులందరూ తీవ్రమైన నష్టానికి గురవుతున్నారు. ఈ గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఆలస్యం జరుగుతున్న కొద్దీ ఫేకర్ కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని పూడ్చలేనిది కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకుని గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.


ఎమ్మెల్సీను సత్కరిస్తున్న సభ్యులు

ఎమ్మెల్సీకి సత్కారం

నెల్లిమర్ల : ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబుని తిరుపతి క్షత్రియ సేవా సమితి సభ్యులు తిరుపతిలో ఆదివారం సత్కరించారు. రెండవ సారి ఎమ్మెల్సీగా ఎంపికైన సురేష్ బాబుని తిరుపతి క్షత్రియ సేవా సమితి సభ్యులు, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్షత్రియ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

భోగాపురం : మండలంలోని పోలిపల్లిలో మార్చ్ 5 నుండి 8 వరకు జరగనున్న పైడితల్లమ్మ జాతర మహోత్సవాలకు సంబందించిన పోస్టర్‌ను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలిపల్లి గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ పెద్ద శంకర్, మామిడి బాలకృష్ణ, మండల పృద్వీరాజ్, పతివాడ బంగార్రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న యువత

పశువులపాకలు దగ్ధం

వేపాడ : మండలంలోని వావిలిపాడులో ఆదివారం పల్లవారి కల్లాల వద్ద పల్ల దేవుళ్ళు, పళ్ళ గంగులకు చెందిన పశువుల పాకలు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. యువత మేల్కొని మంటలను అదుపు చేశారు. బాధితులను సర్పంచ్ బీల రాజేశ్వరి పరామర్శించి ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని చెప్పారు.

ప్రజాగొంతుకైన రమాప్రభను గెలిపించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పెద్దల సభలో ప్రజాగొంతుకై ప్రజా సమస్యలను చట్టసభల్లో ప్రజావాణి వినిపిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని సూడిగాం, బందలుప్పిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కర్షక, ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పట్టభద్రుల అభ్యర్థి పెద్దల సభకు తొలిత మహిళా పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేయడంతో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. డాక్టర్ రమాప్రభ సామాజిక కార్యకర్తగా ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఆర్థిక, సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. పాలక, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల గెలుపుకై ప్రలోభాలు చూపి వేయించుకొని గెలిచిన మరుక్షణమే వారి వ్యాపార అభివృద్ధిపై దృష్టి మల్లుతుందో తప్ప, నిరుద్యోగం, ఉద్యోగుల, ప్రజా సమస్యలు వారికి కనబడవన్నారు. అందుకనే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు ఓటేసి వెనుకబడ్డ ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.పోలినాయుడు, నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించే బాధ్యత మీదేనని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కమిటీ సభ్యులు పట్టణ పరిధిలో ఉన్న పట్టభద్రుల, ఉద్యోగుల, ఉపాధ్యాయుల, ఇళ్లకు వెళ్లి ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల, ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావులతో పాటు ఆయా వీధిపెద్దలు పాల్గొన్నారు.

సూడిగాం, బందలుప్పిలో ప్రజాసంఘాల ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీతానగరం : ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మద్దతుగా సీతానగరం, పెదబోగిలిలోని సుకంకరవీధిలో ప్రజా సంఘ నాయకులు జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు, లక్ష్మునాయుడు ఆదివారం పట్టభద్రుల ఓటర్లను కలిసి పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రజా సమస్యలపై గొంతు విప్పి మాట్లాడే వ్యక్తి అని, గత 20 ఏళ్లుగా అనేక సంస్థల్లో పనిచేసిన వ్యక్తిని అన్నారు. అటువంటి వ్యక్తిని ఎమ్మెల్సీగా పంపితే ప్రజల వాణి వినిపిస్తారన్నారు.

ప్రజ్ఞా వికాస్ పరీక్షకు విశేష స్పందన

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ ప్రశ్నా పత్రాలను జిల్లా కేంద్రంలో ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు, ఇతర మండలాలల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రంలోని హై స్కూల్లో ప్రజ్ఞా వికాస పరీక్షా పత్రాలను ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, యుటిఎఫ్ మండల నాయకులు శ్యామల, శంకర్రావులు ఆవిష్కరించి, పరీలక్షను ప్రారంభించారు. ఈ పరీక్షకు మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, జగదీష్, సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల : పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రేగిడి : రాజాం మండల కేంద్రం డోల పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో నిర్వహించిన ప్రజ్ఞ వికాస పరీక్షకు 500కు పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు, డోలపేట హై స్కూల్ హెచ్ఎం జివి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు చేతులు మీదుగా ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వెంకటేష్, గణేష్, నారాయణరావు, బాలకృష్ణ, ముకేంద్ర పాల్గొన్నారు.


బొబ్బిలి: శ్రీసాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రజ్ఞా పరీక్షకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి పదో తరగతి విద్యార్థులు 400 హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సహాయ కార్యదర్శి మణికుమార్, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కె. కృష్ణదాసు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు వి.నాయుడు ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్లో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చైతన్య, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి. చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షకు 400 మంది విద్యార్థులు పాల్గొని పోటీపడ్డారు. 27 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో మండల కేంద్రంలో జరిగిన పరీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు కళ్యాణి, మండల కార్యదర్శి రమేష్, సభ్యులు విజయ్, నాయుడు, రము, జగదీష్, రూప, ప్రియాంక, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

డెంకాడ: పెదతాడివాడ హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొని రాశారు. ఈ ఎస్ఎఫ్ఐ నాయకులు దత్తి తిరుపతిరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ మండల కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రజ్ఞా వికాస పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఆదిత్య పాఠశాల ప్రిన్సిపాల్ సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నా పత్రాలను విడుదల చేశారు. 550 మంది విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, ప్రసాద్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.


జామి: ప్రశ్నా పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు


ఎస్‌కోట: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షలో 500 మంది విద్యార్థులు పాల్గొని రాశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రఘు, సంపత్, రమణ, దుర్గాప్రసాద్, భాస్కరరావు పాల్గొన్నారు.

భోగాపురం : స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలలో జరిగిన ప్రజ్ఞా వికాస పరీక్షా పత్రాలను చంద్ర విద్యానికేతన్ స్కూల్ అధినేత మురళి మాస్టారు విడుదల చేశవారు. ఈ పరీక్షలో వందలాది మంది పాల్గొన్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ నాయకులు వంశి, శివాజీ, నూకరాజు పాల్గొన్నారు.